క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు రాజీవ్‌నగర్, గుల్షన్‌నగర్, పీవీఆర్ ఆట్రియం మాల్, రోలింగ్ హిల్స్, రాంకీటవర్స్, అంజయ్యనగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా విజేందర్

పటాన్‌చెరు టౌన్: బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా విజేందర్‌ను నియమించినట్లు పటాన్‌చెరు పట్టణ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఈ పదవికి నియమించిన డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి హెబ్బా పటేల్ సందడి



సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం మండుతున్న ఎండలకు నగరవాసులు ప్రత్యేక జాగ్రత్తలను తీసుకోవాలని సినీతార హెబ్బా పటేల్ సూచించింది. శేరిలింగంపల్లిలోని గొలిదొడ్డి వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌ఆర్‌హెచ్ లగ్జరీ సెలూన్‌ను సినీ నటి హెబ్బా పటేల్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెబ్బా పటేల్ మాట్లాడుతూ., అందం ఆరోగ్యసంరక్షణలో భాగంగా మారిందని, అందరూ వ్యక్తిగత సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

నెక్సాన్ ఈవీ మ్యాక్స్ డార్క్ ఎడిషన్ ఆవిష్కరణ

గచ్చిబౌలి: సరికొత్త ఎల్కక్ట్రిక్ ఎస్‌యూవీ 'టాటా నెక్సాన్ మ్యాక్స్ డార్క్ ఎడిషన్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని టాటా మోటార్స్‌లో జీహెచ్‌ఎంసీ వెస్ట్ జోనల్ కమిషనర్ జె.శంకరయ్య, వెంకటరమణ మోటార్స్ డైరెక్టర్ విక్రమాదిత్యలు ఎస్‌యూవీ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. సేఫ్టీ, అడ్వాన్స్ ఫీచర్స్‌తో యువతను ఆకట్టుకుంటుందని డైరెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో టెర్రీటరీ సేల్స్ మేనేజర్ , వెంకటరమణ మోటార్స్ సీఈఓ మహేందర్, జీఎం రవీందర్ పాల్గొన్నారు.

బీజేపీ పాదయాత్రలకు ప్రజల మద్దతు



రాయదుర్గంలో పర్యటిస్తున్న రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: బీజేపీ పాదయాత్రకు ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి రాయదుర్గంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కనీసం పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించడం చేతకాలేదని, ప్రతి ఒక్కటీ లీకేజీ నేనని, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించడమే ఈ పాదయాత్రల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణముదిరాజ్, కృష్ణ యాదవ్, నరేందర్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, నరేందర్‌యాదవ్, హన్మంతునాయకల నరేందర్ గౌడ్, స్వామిగౌడ్, శ్యామ్ యాదవ్, దుర్గారామ్, సతీష్‌కుమార్‌గౌడ్, తిరుపతి, గోపాల్ సుజాత, ఇందిర, పద్మ, సుజాత, రేణుక పాల్గొన్నారు.

నియామకం

మియాపూర్: తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా చందానగర్‌కు చెందిన కొండ విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయ్ కుమార్ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



శ్మశానవాటికలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నిధులున్నా..అభివృద్ధి ఊసేది ..?

- కృష్ణ కాలనీ శ్మశానవాటికలో వసతులు లేక అవస్థలు
- ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.10 లక్షలు కేటాయించినా అసంపూర్తి పనులే..
- అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కృష్ణకాలనీలో శ్మశానవాటిక

హఫీజ్‌పేట్ : జీహెచ్‌ఎంసీ పరిధిలో శ్మశానవాటికలు మహాప్రస్థానంగా అభివృద్ధి చెందుతున్నా శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణ కాలనీ శ్మశానవాటిక కనీస వసతులకు కూడా నోచుకోలేదు. డివిజన్ పరిధిలోని కృష్ణ కాలనీ రెండు దశాబ్దాల క్రితం ఏర్పడింది. శ్మశానవాటికకు వచ్చే వారికి కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోపల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోగా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. కాలనీవాసులు శ్మశానవాటికలో ప్రధాన గేటుతో పాటు చిన్నపాటి షెడ్డు కూడా దాతల ద్వారా నిర్మించుకున్నారు. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్నానపు గదులు, కుళాయిలు వెంటనే ఏర్పాటు చేయడంతో బాటు అసంపూర్తిగా ఉన్న ప్రహరీగోడను పూర్తి చేయాలని కోరుతున్నారు. ప్రహరీ పూర్తిగా లేకపోవడంతో శ్మశానవాటిక ముందే చెత్త చెదారం కుప్పలుగా పేరుకుపోయింది. కాగా పలుమార్లు చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, స్థానిక కార్పొరేటర్‌లు శ్మశానవాటికను పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రత్యేక నిధుల కింద రూ.10 లక్షలు కేటాయించగా కాంట్రాక్టర్ సగం ప్రహరీ నిర్మించి వదిలేశాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిధులు కేటాయించినా పనులు కాలేదు



కాలనీ ఏర్పడినప్పటి నుంచి నేను ఇక్కడే ఉంటున్నా. శ్మశానవాటిక అభివృద్ధిపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళగా ప్రత్యేక నిధులు రూ.10 లక్షలు కేటాయించారు. కానీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అభివృద్ధి నిలిచిపోయింది. ఎమ్మెల్యే పట్టించుకుంటేనే పనులు పూర్తవుతాయి.

-కృష్ణ యాదవ్, కృష్ణ కాలనీ అధ్యక్షులు

వర్షాకాలం తీవ్ర ఇబ్బందులు



కృష్ణ కాలనీ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ప్రహరీ గోడ అసంపూర్తిగా వదిలేశారు.వర్షాకాలం వస్తే శ్మశానవాటికలో ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు కనీస వసతుల కల్పనకు కృషి చేయాలి.

– హరి, కృష్ణ కాలనీవాసి

నేటి నుంచి ఆర్టీసీ బస్సు రూట్లు మార్పు

- 3 నెలల పాటు కొనసాగింపు
- నేటి నుంచి ఆగష్టు 10 వరకు..
- శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో రోడ్డు మూసివేత

రాయదుర్గం: ఆర్టీసీ బస్సు రూట్లు మారాయి. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో శిల్పా లేఅవుట్ ఫేజ్–2 ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొండాపూర్ రోడ్డును 90 రోజులపాటు మూసివేస్తున్న నేపథ్యంలో ఈ మార్పులకు ఆర్టీసీ సంస్థ శ్రీకారం చుట్టింది. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 10 వ తేదీ వరకు ఈ మార్పు అమలులో ఉంటాయి.

- ◆ రూట్ నంబర్ 216కె/ఎల్ బస్సును లింగంపల్లి నుంచి మెహిదీపట్నం వెళ్ళే బస్సు... రాడిసన్ హోటల్ ఎక్స్‌రోడ్డు నుంచి మీనాక్షి టవర్స్, ఐకియా, బయోడైవర్సిటీ ఎక్స్ రోడ్డు రూట్ ద్వారా రాకపోకలు జరుగుతాయి.
- ◆ రూట్ నంబర్ 221 బస్సు మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి మంచిరేవుల బస్సును... రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్ నుంచి గచ్చిబౌలి వరకు రాకపోకలు జరుగుతాయి.
- ◆ రూట్ నంబర్ 10 హెచ్‌డబ్ల్యూ బస్సు సికింద్రాబాద్ నుంచి వేవ్‌రాక్.. బస్సును రాడిసన్ హోటల్, డీఎల్ఎఫ్, ట్రిపుల్‌ఐటీ క్రాస్ రోడ్స్, విప్రో సర్కిల్ మీదుగా రాకపోకలు చేస్తాయి.
- ◆ ఈ రూట్ మార్పులను 90 రోజులపాటు అమలు చేస్తామని, ప్రయాణికులు గమనించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో మేనేజర్ పి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు తప్పని తిప్పలు

ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స



పటాన్‌చెరు టౌన్: కలెక్టర్ హెచ్చరించినా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు తిప్పలు తప్పడం లేదు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో వంద పడకలు ఏర్పాటు చేశారు. ఆయా విభాగాలకు కొన్ని కేటాయించడంతో వచ్చే రోగులకు ఉన్న బెడ్‌లు సరిపోవడం లేదు. దీంతో ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులకు చికిత్స చేస్తున్నారు. ఈ విషయంపై రోగుల కుటుంబ సభ్యులు ఒకే బెడ్‌పై ఇద్దరికి చికిత్స ఎలా చేస్తారని నిలదీస్తున్నా సిబ్బంది బెడ్‌లు లేవని చెబుతూ వస్తున్నారు. ఈ విషయంపై ఆస్పత్రి ఇన్‌చార్జి వివరణ కోరగా రద్దీ వల్ల ఇద్దరికీ ఒకే బెడ్‌పై గ్లూకోజ్ ఎక్కించాల్సి వచ్చిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

మియాపూర్: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఐడీఏ బొల్లారం గాంధీనగరంలో లావణ్య (22) నివాసముంటోంది. శుక్రవారం మధ్యాహ్నం మియాపూర్ మైత్రీ కమాన్ వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతోంది. ఆ సమయంలో వేగంగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు వస్తోంది. ద్విచక్ర వాహనం లావణ్యను ఢీకొట్టడంతో ఎగిరిపడి బస్సు కిందపడింది. దీంతో లావణ్య అక్కడికక్కడే మృతి చెంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు.

సీఎం కప్ క్రీడలకు సర్వం సిద్ధం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కప్ క్రీడలకు సర్వం సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల15 నుంచి నిర్వహించ తలపెట్టిన క్రీడలను ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలో క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సీఎం కప్ పోటీలపై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు గల వారు క్రీడల్లో పాల్గొనవచ్చన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు.

క్రీడాప్రాంగణాలు..

జిన్నారం మండల స్థాయి క్రీడా పోటీలు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడామైదానంలో, రామచంద్రాపురం బీహెచ్‌ఇఎల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, పటాన్‌చెరు మైత్రి క్రీడా మైదానం, గుమ్మడిదల జిల్లా పరిషత్ హై స్కూల్, అమీన్‌పూర్ కృష్ణవేణి హైస్కూల్ గ్రౌండ్స్, పటేల్‌గూడ గ్రామాలలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, దశరథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి



మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌లో 250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని ప్రారంభించిన చైర్మన్ సతీష్‌రెడ్డి , ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మాదాపూర్: గేటెడ్ కమ్యూనిటీలు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ చైర్మన్ వై. సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన 250 కిలోవాట్ సోలార్ పవర్ ప్లాంట్‌ని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, రెడ్కో వైస్ చైర్మన్ జానయ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వై. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు బాగుండాలి, కాలుష్యం నివారించాలనే ఉద్దేశ్యంతో తీసుకున్న ఈ నిర్ణయం ఇతర గేటెడ్ కమ్యూనిటీలకు స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీలో నంబర్ వన్‌గా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పట్టణాలలో కాలుష్యం ఎక్కువగా ఉంటుందని పునరుత్పాదక శక్తి వైపు మళ్ళాల్సిన అవశ్యకత చాలా ఎక్కువగా ఉందన్నారు. రూఫ్‌టాప్ ప్యానెల్స్‌ను పెడితే పై కప్పుకూడా వేడెక్కడం తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం, విద్యుత్ బిల్లుల భారం కూడా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్‌గౌడ్, ఫార్చ్యూన్ టవర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాగంటి సత్యనారాయణ, సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రామారావు, సభ్యులు, రెడ్కో అధికారులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్‌కు 25 శాతం జరిమానా

గచ్చిబౌలి: ట్రేడ్ లైసెన్స్‌ను మే 31 లోపు రెన్యూవల్ చేసుకుంటే కేవలం 25 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుందని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ ప్రియాంక ఆదేశాలు జారీ చేశారని వెస్ట్ జోనల్ లైసెన్స్ ఆఫీసర్ గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 12 నుంచి 31 లోపు ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయించుకున్న వారు 25 శాతం పెనాల్టీ చెల్లించాలని, జూన్ ఒకటి నుంచి రెన్యూవల్ చేసుకునే వారు 50 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉత్తమ బోధనతో మంచి విద్య అందుతుంది

రాయదుర్గం: సమర్ధవంతమైన బోధనతో నాణ్యమైన విద్య అందుతుందని మిచిగాన్ స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజీ సిరాజ్‌అజర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మనూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి కలగజేయడం ఉపాధ్యాయులకు అతిపెద్ద, ప్రధానమైన సవాలు అని అన్నారు. వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ అభివృద్ధిలో అందరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం డాక్టర్ రుబీనా రచించిన 'వ్యక్తిత్వ వికాసంలో సహపాఠ్య కార్యక్రమాల పాత్ర' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు.

హెచ్‌సీయూను సందర్శించిన విదేశీ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీని మాల్దీవుల నుంచి జర్నలిస్టులు/సంపాదకుల ప్రతినిధి బృందం శుక్రవారం సందర్శించారు. భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. పునరుత్పాదక ఇంధనం, పరిశ్రమలు, రక్షణ, పాలన, ఐటీ సేవలు, విద్య, ఫార్మాస్యూటికల్స్ రంగాలలో భారతదేశం సాధించిన విజయాలను విదేశీ మీడియాకు పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగింది. మాల్దీవుల ప్రతినిధి బృందానికి హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆయన వారితో సమావేశమై విద్యా, పరిశోధన, సౌకర్యాల గురించి వివరించారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని వివిధ విభాగాలు, ఇంక్యుబేటర్లలో కల్పించిన సౌకర్యాలను కూడా ఈ ప్రతినిధి బృందం పరిశీలించింది.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 10 మంది పట్టుబడగా, వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి 10 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఏఎస్ఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన మౌలానా (65) కొద్దిరోజులుగా అధిక బరువు, అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి మౌలానా బాత్‌రూమ్‌కు వెళ్లి యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మౌలానాను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి సోదరుడు యాకూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవపడి..

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన హనుమంతు(34) స్క్రాప్ వ్యాపారి. కొంతకాలం క్రితం హనుమంతు బ్యూటీ పార్లర్ పెట్టగా, అందులో నష్టం వచ్చింది. అప్పటి నుంచి హనుమంతు, ఆయన భార్య జయశ్రీ నడుమ తరచు గొడవ జరిగేది. దీంతో మనస్తాపం చెందిన హనుమంతు ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు రాడ్‌కు శుక్రవారం తెల్లవారుజామున చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమంతును చికిత్స కోసం ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడ నుంచి పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని వెల్లడించారు సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి...



వెంకటేశం మృతదేహం

పటాన్‌చెరుటౌన్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందాడు. పటాన్‌చెరు ఏఎస్ఐ బజ్జనాయక్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన వెంకటేశం(50) చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని చిన్నబండ చెరువుకు గురువారం సాయంత్రం వెళ్లాడు. నీటిలో దిగగా, వల చుట్టుకొని ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోయాడు. వెంకటేశం తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్న క్రమంలో శుక్రవారం ఉదయం చెరువులో వెంకటేశం మృతదేహం తేలింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్పెంటర్ అదృశ్యం



అప్పల స్వామి

గచ్చిబౌలి: ఓ కార్పెంటర్ అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చామంతిపూర్, అమలాపురం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఓలేటి అప్పలస్వామి(60) కొండాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో కార్పెంటర్ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 3న మధ్యాహ్నం 3 గంటలకు చెప్పాపెట్టకుండా వెళ్లిపోయాడు. సమీప ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని, సొంత ఊరుకు వెళ్లలేదని తోటి కార్పెంటర్ నాగరాజు గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హనుమజ్జయంతి

చందానగర్: చందానగర్‌లోని విశాఖ శ్రీ శారద పీఠపాలిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పుణ్యాహవచనం, సంకల్పము, విశ్వక్సేన పూజ, దీక్షధారణ, అకల్మషహోమం, అంకురార్పణ, వాస్తు పూజ, అగ్ని మదనం, ధ్వజరోహణ, హోమాలను నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 14వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ సభ్యులు తెలిపారు.

పోస్టర్ మేకింగ్ పోటీలు

రాయదుర్గం: మనూలో శుక్రవారం పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో జీ–20 యూనివర్శిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌కు సంబంధించి పోస్టర్ మేకింగ్ పోటీని నిర్వహించింది. ఎంఈడీ, బీఈడీ, డీఎల్‌ఈడీ కోర్సుల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే అంశంపై ఈ పోటీని విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో సిర్వత్ జహాన్(డీఎల్ఎడ్), ద్వితీయ స్థానంలో సాదియాషబ్నమ్(డిఎల్ఎడ్) తృతీయ బుష్రాఫాతిమా(బీఏడ్) నిలిచారు. వారికి బహుమతులను ప్రదానం చేశారు.

సీబీఎస్ఈలో వందశాతం సాధించిన 'జేఎన్‌వీ'

రాయదుర్గం: సీబీఎస్ఈ ఫలితాల్లో జేఎన్‌వి 100 శాతం ఫలితాలను, పదవ తరగతి, 12వ తరగతి(ప్లస్‌టూ)లో సాధించడం విశేషం. వరుసగా నాలుగవ ఏడాది కూడా రెండు క్లాస్‌లలోనూ 100 శాతం ఫలితాలు వచ్చాయి. ఆ వివరాలను జేఎన్‌వి రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ శుక్రవారం వివరించారు. జేఎన్‌వి 12వ తరగతి ఫలితాలలో 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 69 మంది అత్యుత్తమ మార్కులు సాధించారని ఆయన వివరించారు. 12వ తరగతిలో స్కూల్ సరాసరి 80.63 శాతం మార్కులు సాధించారు. కె చంద్రకాంత్ అనే విద్యార్థి ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టిసెస్‌లో 100కు 100 మార్కులు సాధించడంతోపాటు 569/600 మార్కులు సాధించి జేఎన్‌వి టాపర్‌గా నిలిచారు. మొత్తం 69 మందిలో 56 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులు కాగా మిగిలిన 13 మంది ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణులయ్యారు. సెకండ్ టాపర్‌గా ఆర్ శ్రీకీర్తనరెడ్డి 566/600 నిలువగా, డి హైందవి 559/600 మూడవ స్థానంలో నిలిచారు.

10వ తరగతిలోనూ..

జవహర్ నవోదయ విద్యాలయలో పదవ తరగతి పరీక్షలలో కూడా 100 శాతం ఫలితాలు సాధించింది. 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులు కావడం విశేషం. స్కూల్ సరాసరి 86.82 శాతం మార్కులు సాధించారు.

'డీపీఎస్ టాప్'..

రాయదుర్గం: సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో ఖాజాగూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ టాప్‌లో నిలిచింది. 88 మంది విద్యార్థులు 90శాతంపైగా మార్కులు సాధించగా 262 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించడం విశేషం. కామర్స్ విభాగంలో సహస్రరెడ్డి 491/500 మార్కులు సాధించి స్కూల్ టాప్‌గా నిలిచింది. అదేవిధంగా తనిష్ప్రసాద్ హ్యూమానిటీస్ గ్రూప్‌లో 490/500 ద్వితీయ టాపర్‌గా, యామ్‌వెర్దియా సైన్స్ గ్రూపులో 489/500 మార్కులు సాధించారు.

ఒయాసిస్ స్కూల్‌లో 100 శాతం ఫలితాలు....

రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సీబీఎస్ఈ పది పరీక్షలలో యశస్వి 579/600 (96.5 శాతం) మార్కులతో టాపర్‌గా నిలిచింది. కునల్‌పాండే 570/600 ,కె సాయి వైష్ణవి 565/600, జ్ఞానతేజ 561/600, వర్షిణి 555/600 మార్కులు సాధించినట్లు టీచర్లు వివరించారు.

మెరీడియన్ విద్యార్థుల ప్రతిభ..

మాదాపూర్: సీబీఎస్ఈ పది ఫలితాల్లో మాదాపూర్ మెరీడియన్ స్కూల్ విద్యార్థులు 100శాతం పాస్ కావడంతో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మహిమమిత్ర 96.8 శాతం, విబాలి శ్రీనివాసన్ 96.1శాతం, స్ఫూర్తి ఏదుల 95.8శాతం సాధించారు. అలాగే సీబీఎస్ఈ 12 తరగతి పరీక్షల్లో..కామర్స్‌లో 99శాతం పాలక్‌యాదవ్, సైన్స్‌లో 98శాతం వర్ష సాధించినట్టు తెలిపారు. వందశాతం విజయానికి గాను ఫ్యాకల్టీ, స్టాఫ్, అడ్మినిస్ట్రేషన్‌లను అభినందించారు.